



స్కందమాతగా జోగులాంబ

అలంపూర్ : స్కందమాత రూపంలో జోగులాంబ అమ్మవారు.. మహబూబ్‌నగర్ సాంస్కృతికం: మహబూబ్‌నగర్ బ్రాహ్మణవాడలోని శ్రీవాసవీమాత ఆలయంలో సామూహిక కుంకుమార్చన

వద్దన్నా.. అంటగట్టారు!

- ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు బలవంతంగా అందజేత
- వాయిదాలు కట్టలేని దుస్థితిలో మహిళా సమాఖ్యలు

వనపర్తి జిల్లా కొత్తకోట మండల మహిళా సమాఖ్య రెండు ట్రాక్టర్లు, రొటవేటర్, నాటు వేసే యంత్రం, నాగలి, ఇతర వ్యవసాయ పనిముట్లను రూ.20.23 లక్షలతో బ్యాంకు రుణం ద్వారా తీసుకున్నారు. ప్రతి నెల రూ.50,500 వాయిదా చెల్లించాలి. ప్రస్తుతం మినీ ట్రాక్టర్‌ను ఓ రైతుకు అద్దెకివ్వగా నెలకు రూ.5వేలు ఇస్తారు. మిగతా రూ.45,500 కలిపి వాయిదా చెల్లించాలి. ఈ మండల సమాఖ్య స్త్రీ నిధి ద్వారా బ్యాంకులో రూ.కోటి డిపాజిట్ చేసింది. దానికి నెలకు రూ.54 వేల వడ్డీ వస్తోంది. ప్రస్తుతం వడ్డీ డబ్బులను వాయిదాలకు చెల్లించాల్సి వస్తోంది. సమాఖ్య నిర్వహణ భారంగా మారుతోంది.

మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల సమాఖ్యకు ఈ ఏడాది ప్రారంభంలో రూ.13.32 లక్షలతో ట్రాక్టర్, రొటవేటర్, ట్రాలీ తీసుకున్నారు. డీఆర్‌డీఏ నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని ఒత్తిడి చేయడంతో ట్రాక్టరు, ఇతర పనిముట్లను తీసుకొచ్చి మండల సమాఖ్య భవనం వద్ద పెట్టారు. వీటికి నెలకు రూ.20 వేలు వాయిదా కట్టాలి. వరుసగా మూడు నెలలు మండల సమాఖ్య డబ్బుల ద్వారా ఈఎంఐలు చెల్లించారు. డబ్బు లేక గత నాలుగు నెలలుగా వాయిదాలు చెల్లించడం లేదు.



కొత్తకోట మండల సమాఖ్యకు అందించిన ట్రాక్టర్లు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం: పాలమూరులో మండల మహిళా సమాఖ్యలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఇచ్చిన ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు పెనుభారంగా పరిణమిస్తున్నాయి. పలు సమాఖ్యలు ఈ రుణాలకు వాయిదాలు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నాయి. ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు వద్దని వారించిన వినకుండా బలవంతంగా అంటగట్టారు. వీటిలో చాలా వరకు వృథాగా పడి ఉండటంతో వీటి భారం సమాఖ్యలపై పడింది. దీంతో మహిళా సంఘాలకు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 77 మండలాలుండగా 60 మండలాలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వ్యవసాయ ట్రాక్టర్లు, పరికరాలను అందజేశారు.

రైతులకు వీటిని అద్దెకిస్తూ ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో రుణాల ద్వారా వీటిని మహిళా సమాఖ్యలకు ఇచ్చారు. జాతీయ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) కింద 25 శాతం గ్రాంట్‌తో రుణాలు పొంది వీటి ద్వారా లబ్ధి పొందాలనేది ఉద్దేశం. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో పైలట్ ప్రాజెక్టు కింద దీనిని ప్రారంభించారు. ఇక్కడ 100 శాతం గ్రాంట్‌తో ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పరికరాలు అందించినా ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. తర్వాత అన్ని మండల సమాఖ్యలకు ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులు భావించారు. వీటి కోసం రుణాలు తీసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. గత మూడేళ్లుగా బ్యాంకుల ద్వారా రూ.10-25 లక్షల వరకు రుణాలు ఇప్పించి మహిళా సమాఖ్యలకు బలవంతంగా అంటగట్టారు. ప్రస్తుతం చాలా సమాఖ్యలు ఈఎంఐలు కట్టలేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మరికొన్ని చోట్ల స్త్రీనిధిలో డిపాజిట్ చేసిన డబ్బులతో వచ్చిన వడ్డీలను చెల్లిస్తున్నారు. ఇటీవల వనపర్తి జిల్లాలో ఓ మండల సమాఖ్య వాయిదాలు కట్టలేక వీటిని విక్రయించాలని తీర్మానం చేసినట్లు సమాచారం.

సాధ్యం కాదన్నా...: ప్రస్తుతం గ్రామాల్లో చాలామంది రైతుల వద్ద ట్రాక్టర్లున్నాయి. చిన్న, సన్నకారు రైతులకు స్థానికంగా ఉండేవారే ట్రాక్టర్లు దున్నుకోవడానికి అద్దెకిస్తూ పంట చేతికొచ్చిన తర్వాతే డబ్బు తీసుకుంటున్నారు. మహిళా సమాఖ్యకు మాత్రం నగదు వెంటనే చెల్లించాలి. డీజిల్, డ్రైవర్, నిర్వహణ కోసం ప్రత్యేకంగా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఇవన్నీ సాధ్యం కాదని మండల సమాఖ్యలకు తెలిసే రుణాలు వద్దన్నా తమకు అందించారని పలువురు మహిళలు వాపోతున్నారు. దీనిపై స్త్రీనిధి వనపర్తి డీపీఎం రాము, నాగర్‌కర్నూల్ డీపీఎం సుధాకర్ మాట్లాడుతూ కొన్నిచోట్ల అనుకున్న స్థాయిలో వీటికి అద్దె రావడంలేదన్నారు.

వడ్డీ డబ్బులు చెల్లిస్తున్నాం: ప్రతి గ్రామంలో 10 సంఖ్యలో ట్రాక్టర్లున్నాయి. మా సమాఖ్య ట్రాక్టర్లను అద్దెకు తీసుకునే పరిస్థితిలో లేరు. ప్రతినెల ఈఎంఐలు కట్టడానికి డబ్బులు లేక స్త్రీనిధి ద్వారా వచ్చే వడ్డీ నగదు చెల్లిస్తున్నాం. ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పరిష్కారం చూపాలి.
-ప్రసన్నరాణి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, కొత్తకోట

ప్రమాదకరంగా గన్యా

ఉమ్మడి జిల్లా నుంచి పుణెకు రక్త నమూనాలు

న్యూస్‌టుడే, పాలమూరు



మహబూబ్‌నగర్: తిమ్మాసానిపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా మలేరియా నివారణ అధికారి డా.శశికాంత్

మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ నేతకు గత నెల 7న జ్వరం రాగా రక్త పరీక్షలు చేయించుకున్నారు. టైఫాయిడ్‌తో పాటు గన్యా పాజిటివ్‌గా ఫలితం వచ్చింది. 15 రోజుల క్రితం పరీక్ష చేయించుకుంటే నెగిటివ్ వచ్చింది. అయినా మోకాళ్లు, చేతులు, పాదాలు, కీళ్లల్లో నొప్పి మాత్రం తగ్గలేదు. ఇప్పటికీ మరో వ్యక్తి సహాయంతోనే నడుస్తూ పనులు చేసుకోవాల్సి వస్తోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో చాలామంది గన్యాతో బాధపడుతున్నారు. పలువురు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

గన్యా గతంలో 15, 20 రోజుల్లో పూర్తిగా తగ్గేది. ఇప్పుడు ఆ వ్యాధి నెల రోజులు దాటినా తగ్గడం లేదు. ఎడిస్ దోమ కాటే ఇందుకు కారణం. ఇది రాత్రి పూట కంటే పగటి పూట కుట్టిన వారికే ప్రమాదం ఎక్కువ. ఈ దోమ ద్వారా వచ్చే ఆల్ఫా వైరస్ రూపాంతరం చెందుతుండటంతో గన్యా త్వరగా తగ్గడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధంగా ఉండటంతో అన్ని జిల్లాల నుంచి అనుమానితులు, బాధితుల నుంచి రక్త నమూనాలను సేకరించి మహారాష్ట్రలోని పుణెలో ఉన్న ఎన్ఐవీ(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ) ప్రయోగశాలకు పంపంచాలని డీఎంహెచ్ఓలకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు అధికారులు వారం క్రితం నమూనాలను సేకరించి వాటిని ప్రయోగశాలకు పంపించారు. నమూనాల నివేదికలు వచ్చాక వైరస్ తీవ్రత తెలుస్తుందని, దాన్ని బట్టి వైద్యులు చికిత్సను అందిస్తారని మహబూబ్‌నగర్ జిల్లా మలేరియా వ్యాధి నివారణ అధికారి డా. శశికాంత్ 'న్యూస్‌టుడే'కు వివరించారు.

ప్రతి జిల్లా నుంచి 10 నమూనాలు : గన్యా తీవ్రతను తెలుసుకోవడానికి, మారుతున్న వైరస్ లక్షణాలను పసిగట్టడానికి ప్రతి జిల్లా నుంచి కనీసం 10 రక్త నమూనాలు సేకరించారు. జ్వరంతో బాధ పడుతున్నవారు, మోకాళ్లు, పాదాలు, చేతులు, అరికాళ్లు తదితరాల వద్ద కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్న అనుమానితుల నుంచి రక్త నమూనాలను నాలుగు జిల్లాల్లో తీసుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఒక్క కేసు నమోదు కాకపోవడంతో అక్కడి నుంచి నమూనాలను పంపించలేదు.

- మహబూబ్‌నగర్ జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 38 గన్యా కేసులు నమోదయ్యాయి. అనధికారంగా ఇంకా చాలా మంది బాధితులు ఈ వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మహబూబ్‌నగర్, భూత్పూర్, మిడ్జిల్, జడ్చర్ల తదితర పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల నుంచి 10 మంది అనుమానితుల నుంచి నమూనాలను సేకరించారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో పది నెలల నుంచి మూడు కేసులే నమోదయ్యాయి. పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి, బిజినేపల్లి, కల్వకుర్తి, తాడూరు తదితర ప్రాంతాల్లో జ్వరం, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న 11 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు.
- వనపర్తి జిల్లాలో 17 గన్యా కేసులు నమోదయ్యాయి. పెద్దమందడి, కడుకుంట్ల మండలాల్లో 10 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు.
- నారాయణ పేట జిల్లాలో గన్యా కేసులు నమోదు కాలేదు. కోటకొండ, మద్దూర్, నారాయణపేట, దామరగిద్ద తదితర ప్రాంతాల్లో 19 మంది అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు.

మత్స్యకారుల అభ్యున్నతికి సర్కారు చేయూత : యెన్నం



ఇబ్రహీంబాద్ హేమసముద్రంలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర తదితరులు

మహబూబ్‌నగర్ వ్యవసాయం : మత్స్యకారుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఉచిత చేపపిల్లలతో పాటు వలలు, పుట్టీలు, ఇతర సామగ్రిని అందించేందుకు కృషి చేస్తుందన్నారు. సోమవారం హన్వాడ మండలం ఇబ్రహీంబాద్‌లోని హేమసముద్రంలో ఆయన ఉచిత చేప పిల్లలను కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. మత్స్యకారులతో పాటు చెరువును నమ్ముకున్న రైతులకు మేలు చేస్తామన్నారు. చెరువులో పేరుకుపోయిన పూడిక తొలగించేందుకు నీటి పారుదల శాఖ మంత్రితో మాట్లాడమన్నారు. చెరువులు, అలుగులను బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో మత్స్యకారులు పురోగతి సాధించాలన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి రాధా రోహిణి, వ్యవసాయ మార్కెట్ అధ్యక్షురాలు అనిత, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నర్సింహారెడ్డి, మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, స్థానిక సంఘం అధ్యక్షుడు వెంకట్రాములు పాల్గొన్నారు.

రైతేరాజు 8 లో..

పచ్చని పొదల మాటున ప్రమాదం

జిల్లా కేంద్రంలో అస్తవ్యస్తంగా విద్యుత్తు నియంత్రికలు

ఈనాడు పరిశీలన


పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్ర పాలమూరులో విద్యుత్తు నియంత్రికలు పచ్చని పొదల మాటున ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవలి వర్షాలకు చాలా చోట్ల నియంత్రికల చుట్టూ పిచ్చిమొక్కలు, తీగలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగి నియంత్రికలను కప్పేశాయి. ఇక్కడో విద్యుత్తు నియంత్రిక ఉండాలే? అంటూ ఆ శాఖ అధికారులు వెతుక్కోవాల్సిన పరిస్థితులు చాలా చోట్ల నెలకొన్నాయి. విలీన గ్రామాలు కలుపుకొని పురపాలిక పరిధిలో సుమారు 780 వరకు విద్యుత్తు నియంత్రికలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సగానికి సగం నియంత్రికలు ప్రమాదకరంగానే ఉన్నాయని 'న్యూస్‌టుడే' చేసిన క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. అందులో కొన్ని ప్రమాదకర నియంత్రికల వివరాలు ఇలా ఉన్నాయి.



రద్దీ మార్గంలోనే ఇలా.. : ఈ విద్యుత్తు నియంత్రిక 47వ వార్డు పరిధిలోని పోలీస్‌లైన్ స్కూల్ పక్కన ప్రధాన రహదారిలో ఉంది. నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే రహదారికి అత్యంత దగ్గరలో ఉన్న నియంత్రిక చుట్టూ పచ్చని తీగలు అల్లుకున్నా విద్యుత్తు శాఖ సిబ్బంది తొలగించడం లేదు. పాదచారులు, వాహనదారులు నియంత్రిక పక్క నుంచి వెళ్తే అంతే సంగతి. వర్షాలు కురుస్తున్నప్పుడు మరింత ప్రమాదకరం. ఈ వార్డుల్లో ఉన్న మరో 30 నియంత్రికల పరిస్థితి ఇలాగే ఉంది.



ఒకే వార్డులో 20 చోట్ల.. : ఈ నియంత్రిక 34వ వార్డు పరిధిలో ఖలీల్‌చౌక్ నుంచి కొత్తచెరువు రోడ్డు వచ్చే మార్గంలో రహదారికి దగ్గరగా ఉంది. నియంత్రికను పచ్చని తీగలు అల్లుకుంటున్నాయి. చుట్టూ ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి కప్పేస్తున్నాయి. ఇదే తరహాలో ఈ వార్డులో మరో 20 వరకు నియంత్రికలు పొదల మాటున ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయి.



సాలీడు గూడులా తీగలు : 33వ వార్డు ఖలీల్‌చౌక్‌లోని దాదాపు అన్ని వీధుల్లో ఇలాంటి విద్యుత్తు స్తంభాలే దర్శనమిస్తాయి. ప్రతి స్తంభానికి విద్యుత్తు తీగలతో పాటు పెద్ద మొత్తంగా టీవీ, అంతర్జాలం కేబుళ్లు చుట్టి ఉండడంతో వర్షాలు కురిసినప్పుడల్లా షార్ట్‌సర్క్యూట్‌తో వీధిదీపాలతో పాటు ఇళ్లలో టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని స్థానికులు వాపోయారు. నెట్‌వర్క్, టీవీ కేబుళ్ల నుంచి ముప్పేనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కలెక్టర్ నివాసం సమీపంలోనే.. : ఈ రెండు నియంత్రికలు కలెక్టర్ నివాసానికి అత్యంత సమీపంలో ఎన్టీఆర్ కల్యాణ మండపం ఎదురుగా ఉన్నాయి. చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి విద్యుత్తు నియంత్రికలనే కమ్మేశాయి. ఈ మార్గంలో వివేకానందనగర్, బోయపల్లిగేట్ ప్రాంతాలు ఉంటాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, కాలినడకన వెళ్లే ప్రజలు నియంత్రికలకు సమీపం నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. పొదల మాటున ఉండే నియంత్రికలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు.



కొలిక్కి వచ్చిన ఎంపిక

1:1 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితా తయారీ



డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టులకు1:1 నిష్పత్తిలో అర్హత కలిగిన వారి వివరాలను తయారు చేస్తున్న జీహెచ్‌ఎంలు, విద్యా శాఖ సిబ్బంది

పాలమూరు, మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : డీఎస్సీ ప్రక్రియ కసరత్తు తుది దశకు చేరుకుంది. సోమవారం మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో డీఈవో పర్యవేక్షణలో 12 కమిటీలకు చెందిన 24 మంది జీహెచ్‌ఎంలు, 12 మంది సహాయకులు, విద్యాశాఖ సిబ్బందితో కలిసి 1:1 నిష్పత్తిలో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేశారు. డీఎస్సీ-2024లో ప్రకటించిన పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా మంచి ర్యాంకులు సాధించిన వారి వివరాలు పరిశీలించారు. ఆయా సబ్జెక్టుల్లో రిజర్వేషన్ల వారీగా ఉన్న పోస్టులు, 95 శాతం స్థానికత, 5 శాతం ఓపెన్ టు ఆల్ అనే నిబంధన ఆధారంగా కసరత్తు చేశారు. 243 పోస్టులకు ఒకరి చొప్పున అభ్యర్థులను ఖరారు చేశారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 11 పోస్టులు అందులో ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో ఒక పోస్టును అత్యధిక మార్కులు తెచ్చుకున్న వారు లోకల్ అయినా, నాన్ లోకల్ అయినా కేటాయిస్తారు. డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ తెలుగు మాధ్యమ విభాగం సాంఘిక శాస్త్రంలో స్థానిక సంస్థల పాఠశాలల్లో 11 పోస్టులు ప్రకటించారు. అందులో ఒక పోస్టు ఓపెన్ టు ఆల్‌గా ప్రకటించి అత్యధిక మార్కులు పొందిన మొదటి వ్యక్తికి ఇస్తారు.

పోస్టుల వివరాలిలా.. : డీఎస్సీ -2024లో ప్రకటించిన పోస్టుల్లో అన్నింటికి అభ్యర్థులను ఎంపిక చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఒక అభ్యర్థి ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌కు అర్హత సాధిస్తే ఒక పోస్టుకే ఎంపిక చేసి మరొకటి బ్యాక్‌లాగ్‌లో ఉంచకుండా మెరుగైన మార్కులు తెచ్చుకున్న మరో అభ్యర్థిని ఎంపిక చేయడానికి విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భాషా పండితుల విభాగంలో 26 పోస్టులు ఉన్నాయి. హిందీలో ఆరు, తెలుగులో 10, ఉర్దూలో 8 పోస్టులు ఉన్నాయి. 8 పీఈటీ పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 45 పోస్టులు ఉండగా.. జీవశాస్త్రంలో-07, ఆంగ్లం-02, హిందీ-03, గణితం-04, వ్యాయామ విద్య-04, సాంఘికశాస్త్రం-14, తెలుగు-03, ఉర్దూ-01, ప్రత్యేక అవసరాల విద్య-07 చొప్పున పోస్టులు ఉన్నాయి. ఎస్జీటీ విభాగంలో 166 పోస్టులు ఉండగా, 121 తెలుగు మాధ్యమంలో, 25 ఉర్దూ మాధ్యమంలో, ప్రత్యేక అవసరాల విద్యలో మిగతా 20 పోస్టులు ఉన్నాయి.

9న 243 మందికి నియామక పత్రాలు : హైదరాబాద్‌లో ఈనెల 9న సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అందించే ఉపాధ్యాయ నియామక పత్రాల స్వీకరణకు 243 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. 9న మధ్యాహ్నం 2 గంటలకే చేరుకునేలా ఆరు బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. ఎంపికైన వారు ఉదయం 8 గంటలకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చేరుకోవాలి.
– విజయేందిర బోయి, కలెక్టర్

పొరపాట్లు లేకుండా ప్రక్రియ : అన్ని రకాల నిబంధనలు పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా తుది జాబితా తయారు చేశాం. రాష్ట్ర జాబితా కోసం ఎదురు చూస్తున్నాం. ఆ జాబితాను పోల్చి చూస్తాం. పొరపాట్లు ఉంటే పాఠశాల విద్య రాష్ట్ర సంచాలకులకు సమాచారం అందిస్తాం. రాష్ట్ర అధికారులదే తుది నిర్ణయం. అభ్యర్థులకే నేరుగా సమాచారం వస్తుంది.
– రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్

త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిత్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కలెక్టర్ సంతోష్ తదితరులు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : కొత్త రెవెన్యూ చట్టాన్ని త్వరలోనే అమల్లోకి తేబోతున్నామని, ప్రతి కుటుంబానికి స్మార్ట్‌కార్డులు జారీ చేసేందుకు పైలట్ ప్రాజెక్టు ప్రారంభించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో సుమారు రూ.43 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని, రైతులు, నిరుద్యోగులు, ఆడపడచులు, బడుగులకు న్యాయం చేస్తామన్నారు. మార్పు కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన తెస్తామన్నారు. అన్నదాతలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరం ఉండగా ఇప్పటికే రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఎన్ని రూ.కోట్లయినా సరే ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 4వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలల్లోనే 61వేల ఉద్యోగాలను భర్తీ చేశామని ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా సంక్షేమ పథకాలను అమలు చేసి తీరుతామన్నారు.

భారాస పాలనతోనే ఆర్థిక దుస్థితి

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమామహేశ్వరం ధర్మకర్తల బృందం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పదేళ్ల భారాస పాలనలో ఫాం హౌస్‌లకు పరిమితమైన నేతల నిర్వాకంతో రాష్ట్రాన్ని రూ. లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక మనుగడ లేకుండా చేశారని అటవీ, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ విమర్శించారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలతోనే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టారన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం శ్రీ ఉమామహేశ్వర క్షేత్రం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ఛైర్మన్‌గా బీరం మాధవరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కేసీఆర్ సంతకాలు చేయక పోవడంతో వందల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ వంటి పథకాలతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. భారాస పార్టీ ఖాతాలో రూ.1,500 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, సీఎంగా రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటల పాటు కష్టపడుతున్నారన్నారు. పదేళ్ల పాటు పరిష్కరించని రెండు పడక గదుల ఇళ్లు, కేజీ నుంచి పీజీ విద్య, ఇంటికో ఉద్యోగం, మూడెకరాల భూ పంపిణీ వంటివి అమలు చేయకుండానే సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారన్నారు. ఈ నెల 6న 1,635 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశామని, 9న ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేయనున్నామన్నారు. భారాస నేతలు సామాజిక మాధ్యమాల వేదికగా అభూత కల్పనలు సృష్టించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లతో సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్‌రెడ్డి, క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేందర్, నేతలు మోపతయ్య, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణాల పక్కదారిపై తనిఖీలు ముమ్మరం

పాలమూరు పురపాలకం : కోయనగర్ శ్రీసాయి మహిళా సంఘాల సమాఖ్య పొదుపు సొమ్ము దుర్వినియోగంపై సోమవారం రెండో రోజూ తనిఖీలు కొనసాగాయి. ఈసారి 10 సంఘాల రికార్డులను సీవోలు, ఆర్పీలు తనిఖీ చేయగా రూ.15లక్షల నుంచి రూ.20లక్షల లోపు దుర్వినియోగం చేసినట్లు తేలింది. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా మహిళల పేర్ల మీద తీసుకున్న రుణాల్లో అధిక మొత్తంలో ఆర్పీ శ్రీలత సొంతానికి వినియోగించుకున్నట్లు గుర్తించారు. కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యలో మొత్తం 32 వార్డు సంఘాలు ఉండగా శనివారం 12 సంఘాలకు నిర్వహించిన తనిఖీల్లో రూ.67.72 లక్షలు దుర్వినియోగం అయినట్లు గుర్తించిన విషయం తెలిసిందే. మిగిలిన 10 సంఘాలను మంగళవారం తనిఖీ చేయనున్నట్లు డీఎంసీ శివకుమార్ తెలిపారు.

సేవలో తరిస్తూ.. అనుభవం గడిస్తూ!

జనరల్ ఆసుపత్రిలో హౌస్ సర్జన్ శిక్షణ పొందుతున్న వైద్య విద్యార్థినులు




న్యూస్‌టుడే, పాలమూరు : మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల 2019 బ్యాచ్‌కు చెందిన 175 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు ఆరు నెలల క్రితం థియరీ పరీక్షలు రాశారు. నాలుగున్నరేళ్ల నుంచి పుస్తకాలతో కుస్తీ పట్టిన వారు ఇప్పుడు హౌస్ సర్జన్ శిక్షణలో భాగంగా స్టెత్ పట్టి మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో రోగులకు సేవలందిస్తున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ, ప్రసూతి, ఈఎన్‌టీ, సైకియాట్రీ, చిన్నపిల్లలు, కన్ను, అనస్తీషియా, చర్మ తదితర 19 విభాగాల్లో రాత్రీ పగలు అన్న తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. కీలకమైన అత్యవసర విభాగంలో 12 మంది సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురిని 'న్యూస్‌టుడే' పలకరించింది. హౌస్ సర్జన్ శిక్షణ అనుభవాలు, అనుభూతులు వారి మాటల్లోనే..

ఆనందం.. ఆత్మవిశ్వాసం : తరగతి గదుల్లో నేర్చుకున్న వైద్యవిద్యను ఇప్పుడు ఆసుపత్రిలో ఉపయోగిస్తున్నాం. వివిధ సమస్యలతో వచ్చిన రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాం. వారంతా వ్యాధులు నయమై ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్తుంటే చాలా ఆనందంగా ఉంటోంది. హౌస్ సర్జన్ శిక్షణతో నాలో ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది. కొన్ని రోజుల తర్వాత ఎంబీబీఎస్ కోర్సు పూర్తవుతుంది. అనంతరం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తాను.

- భవానీ, సూర్యాపేట పట్టణం

ఆచార్యుల మార్గదర్శనంలో.. : రోగులు రకరకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ జనరల్ ఆసుపత్రికి వస్తున్నారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్నా. ఏయే కేసులకు ఎలాంటి చికిత్సలు అందించాలో శిక్షణ పొందుతున్నా. మా ఆచార్యుల సలహాలు, సూచనలతో ముందుకు సాగుతున్నా. ఇన్నాళ్లు పుస్తకాలు చదివి, తరగతులు వింటూ పొందిన జ్ఞానం ఉపయోగిస్తూ జనరల్ ఆసుపత్రికి వచ్చే పేదలకు వైద్య సేవలు అందించటం చాలా ఆనందంగా ఉంది.

- పావని, కర్నె(మక్తల్)





మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అత్యవసర వైద్య విభాగంలో సేవలందిస్తున్న వైద్య విద్యార్థులు



రోజు 50 కేసులు చూస్తున్నా.. : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోజూ 50 వరకు ఐపీ కేసులను చూస్తున్నా. ఒక్కొక్కరు ఒక్కో సమస్యతో వస్తున్నారు. ముందుగా ప్రతి రోగి రిపోర్టులను చూసి వారి వ్యాధిపై ఒక అవగాహనకు వచ్చి చికిత్సలు అందిస్తున్నా. హౌస్ సర్జన్‌లో చాలా కొత్త విషయాలు తెలుస్తున్నాయి. రోగులకు నేరుగా వైద్య సేవలు అందించటం ఎంతో సంతృప్తిని ఇస్తోంది. అన్ని విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ సమగ్ర అవగాహన పెంచుకునేందుకు శిక్షణను సద్వినియోగం చేసుకుంటా.

- ఫరిసా, న్యూటౌన్, మహబూబ్‌నగర్

అన్ని రకాల సమస్యలకు వైద్యం : చిన్నప్పటి నుంచి వైద్య విద్యంటే చాలా ఇష్టం. వైద్యురాలిని కావాలన్న పట్టుదలతో చదివాను. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సీటు వచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏడాది పాటు కొనసాగే హౌస్ సర్జన్ శిక్షణలో ఉన్నాను. ఇక్కడికి అనేక రకాల కేసులు వస్తున్నాయి. వారికి పరీక్షలు చేస్తూ వైద్యం అందిస్తున్నా. మంచి వైద్యురాలిగా స్థిరపడేందుకు ఎంతో ఉపయోగపడే ఈ శిక్షణ కాలాన్ని సద్వినియోగం చేసుకుంటా.

- ప్రవళిక, సూరాపూర్ (లింగాల)

నేడు మంత్రి రాక..

అలంపూర్, న్యూస్‌టుడే : అలంపూర్ ఆలయాల దర్శనానికి మంగళవారం దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ రానున్నట్లు ఈవో పురేందర్ తెలిపారు. ఈనెల 9వ తేదీన నిర్వహించే కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరుపున మంత్రి పట్టువస్త్రాలు అందజేస్తారు.

ఆలయ అభివృద్ధికి రూ.4లక్షల వితరణ

రాజోలి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని అడివేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల పట్టణానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు కొండపాటి రాజులు రూ.4 లక్షలు అందజేశారు. సోమవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులకు ఈ నగదు అందించారు. ఆయన గతంలోనూ ఆలయ అభివృద్ధికి కొంత నగదు అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావ్, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాత

కూరగాయల పంట.. లాభాలు ఇంట

పాన్‌గల్, న్యూస్‌టుడే : కూరగాయలతో అధిక ఆదాయం పొందవచ్చని నిరూపిస్తున్నారు రైతు దంపతులు. ఐదేళ్లుగా సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. పాన్‌గల్‌కు చెందిన కొత్త మోహన్‌రెడ్డి, కృష్ణవేణి దంపతులకు మూడెకరాల పొలం ఉంది. అరెకరంలో వరి సాగు చేస్తున్నారు. మిగిలిన పొలంలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. ఏడాది పొడవునా వీటిని సాగు చేస్తూ నిత్యం ఆదాయం వచ్చేలా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. పంటను పొలం వద్ద, సంతలకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. అవసరాన్ని బట్టి కూలీలను పిలిపించుకుంటారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ ఆదాయం పొందుతున్నారు.



సాగుచేసిన చిక్కుడు

పంట సాగు ఇలా..: ఐదేళ్ల క్రితం వీరు బిజినేపల్లిలో నివాసం ఉండేవారు. ఒకరి వద్ద పనిచేయడం కంటే సొంతంగా ఏదైనా చేయాలని గ్రామానికి వచ్చారు. వరి సాగు చేస్తే వాతావరణ మార్పులతో తెగుళ్ల నుంచి పంట రక్షించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూరగాయల సాగులో తక్షణమే నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందని గుర్తించారు. స్థానికంగా ఎక్కువ మంది రైతులు కూరగాయలు పండించడాన్ని గమనించి సాగు చేపట్టారు. విత్తనాలు బిజినేపల్లి, కర్నూల్ నుంచి తెచ్చి నాటుతున్నారు. రెండున్నర ఎకరాల్లో ప్రతి పది గుంటల్లో ఒక రకం కూరగాయలను సాగు చేస్తుంటారు. చిక్కుడు, బెండ, వంకాయ, మిరప, కాకర, ఉల్లి, పాలకూర, మెంతి, కొత్తిమీర సాగు చేస్తున్నారు. ఉల్లి నారు ఇతర రైతులకు విక్రయిస్తుంటారు.



కలుపు నివారణకు గుంటక కొడుతున్న రైతు

ఏడాదికి రూ.3 లక్షలకు పైగా ఆదాయం: ఏడాదికి సుమారు రూ.2లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఖర్చులన్నీ పోగా రూ.3-4 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పంటను చీడపీడల నుంచి కాపాడేందుకు వేప నూనె వినియోగిస్తాం. ప్రధాన రహదారి వెంట పొలం ఉండటంతో రాకపోకలు సాగించే వారు తాజా కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. ఆదివారం వనపర్తి సంత, బుధవారం పాన్‌గల్, గురువారం కేతేపల్లి సంతకు కూరగాయలు తీసుకెళ్లి విక్రయిస్తాం. మాకు ఇద్దరు కుమార్తెలు సంతానం. ఒక అమ్మాయికి పెళ్లి చేశాం. మరో అమ్మాయిని కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదివిస్తున్నాం. కూరగాయల సాగుతో కష్టానికి తగ్గ ఫలితం వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మిరప తోటకు నష్టం వాటిల్లింది.

- కొత్త మోహన్‌రెడ్డి, పాన్‌గల్

యాసంగి మినుములో యాజమాన్య పద్ధతులు



మదనాపురం, న్యూస్‌టుడే : యాసంగి సీజన్‌లో సాగుచేసే మినుములో అధిక దిగుబడి సాధనకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి రైతులకు సూచనలు అందించారు.

అనువైన రకాలు : పల్లాకు తెగులు తట్టుకునే పాలిష్ రకాలు సాగు చేసుకోవాలి. ఎల్‌బీజీ 752, 787, 645, 648, ఎంబీజీ 207, టీబీజీ 104, 129, జీబీజీ 1 అధిక దిగుబడినిచ్చే రకాలు. విత్తనాలు అక్టోబర్ నెల చివరి వరకు వేసుకోవచ్చు.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేదా 5 గ్రాముల థయోమిథాక్సామ్ లేదా 5 మి.లీ మోనోక్రోటోఫాస్‌తో కలిపి విత్తనశుద్ధి చేయాలి. భూమి నుంచి సంక్రమించే వ్యాధుల నివారణకు కిలో విత్తనానికి థైరమ్ లేదా క్యాప్టాన్ లేదా మ్యాంకోజెబ్ లేదా కార్బండిజియం 2.5గ్రాములు లేదా ట్రైకోడర్మావిరిడి 8 గ్రాములు కలిపి విత్తాలి.

ఎరువుల యాజమాన్యం: చివరి దుక్కిలో ఎకరానికి 2 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. రైజోబియం కల్చర్‌ను 200 గ్రాముల పొడి విత్తనం చుట్టూ పొరల్లో ఉండేలా ఒక గంట ముందు విత్తనానికి పట్టించాలి. ఎకరానికి 2 కిలోల ఫాస్ఫోబాక్టీరియాను 200 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి దుక్కిలో లేదా విత్తనం వేసేటప్పుడు సాళ్లలో పడేటట్లు చూసుకోవాలి.

కలుపు నివారణ : విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు ఎకరాకు పెండిమిథాలిన్ 30 శాతం 1.3-1.6 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారీ చేసుకోవాలి. విత్తనం వేసిన 20-25 రోజుల్లో ఎకరాకు ఇమాజిథఫైర్ 300 మి.లీ. లేదా గడ్డిజాతి కలుపు మొక్కలు నివారణకు క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ లేదా ప్రోపాక్విజఫాప్ 10 శాతం 250 మి.లీ ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

చీడపీడల యాజమాన్యం: మినుము సాగులో చీడపీడలతో పంటకు నష్టం వాటిల్లుతుంది. రసంపీల్చే పురుగు, తెల్లదోమ, తామర పురుగుల నివారణకు 5శాతం వేపమందుతో మోనోక్రోటోఫాస్ 1.6మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.3 గ్రాములు లేదా థైఫెనిథియోరాన్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పంట 20-25 రోజుల దశలో పిచికారీ చేయాలి. మారుకగూడు, పొగాకులద్దె పురుగు నివారణకు మొదటిదశలో క్లోరోఫైరిఫాస్ 50ఈసీ 1.5మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు, తర్వాత దశలో న్యూవులురాన్ 0.75మి.లీ లేదా ఫ్లూబైండమైడ్ 0.2మి.లీ లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3మి.లీ మందులను ఏదైనా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో ఆకుముడత పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- వెంకటయ్య, రామన్‌పాడ్

✔ లీటరు నీటికి ఎసిఫేట్+ఇమిడాక్లోప్రిడ్ 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా కోరాంట్రీనిపోల్ 0.3 మి.లీ లేదా టెట్రానిపోల్ 0.5 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

? వేరుసెనగలో కుళ్లు నివారణకు చర్యలు తెలపండి.

- రాఘవేందర్, దుప్పల్లి

✔ లీటరు నీటిలో కార్బండిజియం+మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా టెబ్యూకోనోజోల్ 1 మి.లీ కలిపి మొక్కల మొదళ్లు తడిచేటట్లు పిచికారీ చేయాలి.

? మిరపలో కింద ముడత (నల్లి) నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- శేఖర్, మదనాపురం

✔ నల్లి ఉద్ధృతి బట్టి ఎకరానికి పెగాసస్ 300 గ్రాములు లేదా క్లోరోఫెనాపైర్ 400 మి.లీ లేదా జోలోన్ 400 మి.లీ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, మదనాపురం



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం

పత్తి లోడు వాహనం బోల్తా

ఇద్దరు హమాలీల దుర్మరణం

కర్నూలు గ్రామీణ, నేరవిభాగం న్యూస్‌టుడే : కర్నూలు గ్రామీణ మండలం ఆర్.కొంతలపాడు వాగు వద్ద సోమవారం పత్తి లోడు వాహనం బోల్తాపడిన ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం తిమ్మాజీపల్లె గ్రామానికి చెందిన జ్ఞానవంతుడు (28), జమ్మన్న (40)తోపాటు మరో నలుగురు పత్తి వ్యాపారుల వద్ద హమాలీలుగా పని చేస్తున్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు పరిధిలో బొలెరో వాహనంలో పత్తి లోడు చేసుకుని శాంతినగర్‌కు బయలుదేరారు. కర్నూలు గ్రామీణ మండలం ఆర్.కొంతలపాడు వాగులో నుంచి వాహనం పైకి ఎక్కే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంపైన కూర్చోవడంతో వాహనం మీద పడి జ్ఞానవంతుడు, జమ్మన్న అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీకాంత్, పరశురాముడు, సురేష్, నర్సింహులు గాయపడగా వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. జ్ఞానవంతుడికి మూడేళ్ల కిందట వివాహమైంది. జమ్మన్నకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కర్నూలు తాలూకా అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జ్ఞానవంతుడు, జమ్మన్న

శ్రీలక్ష్మి నీ మహిమలూ.. చిత్రమై తోచునమ్మా!



మహబూబ్‌నగర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మెప్మా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, పురపాలిక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ దంపతులు, పుర కమిషనర్, కౌన్సిలర్లు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. మైదానంలో బతుకమ్మలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి వాటి చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీప్రసన్న, మార్కెట్ ఛైర్‌పర్సన్ అనిత, మహిళా కౌన్సిలర్లు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

పాతబస్టాండ్(నారాయణపేట) : నారాయణపేట బారంబావి రాంలీల మైదానంలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా.పర్ణికరెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, శిక్షణ కలెక్టర్ గరీమ నరుల అతిథులుగా హాజరై బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గందె అనుసూయ, కౌన్సిలర్లు సరిత, వరలక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్: సతీమణితో కలిసి వేడుకకు హాజరైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో పుర ఛైర్‌పర్సన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు



పేట : బారంబావి దగ్గర బతుకమ్మ ఆడుతున్న పేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, కలెక్టరు సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టరు గరిమ నరుల, మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనసూయ, కౌన్సిలర్లు





మహబూబ్‌నగర్: భారీ బతుకమ్మతో స్వీయచిత్రం దిగుతున్న యువతి



నారాయణపేట: బారంబావి దగ్గర కోలాహలం



నారాయణపేట: భారీ బతుకమ్మ వద్ద మహిళల ఆటపాటలు



మహబూబ్‌నగర్: అమ్మవారి రూపాన్ని అలంకరించిన బతుకమ్మతో మహిళ

నీట మునిగి విద్యార్థి మృతి



తరుణ్

మదనాపురం, న్యూస్‌టుడే: నీట మునిగి ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తకోట మండలంలోని రాయినిపేటకు చెందిన సత్యం, జానకమ్మ దంపతుల కుమారుడు తరుణ్(12) దసరా సెలవులు కావడంతో అమ్మమ్మ ఊరైన మదనాపురం మండలంలోని నెల్విడికి ఆదివారం మధ్యాహ్నం వచ్చాడు. సోమవారం కొంత మంది స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న ఊకచెట్టు వాగు వద్దకి ఈతకు వెళ్లాడు. తరుణ్ ఒడ్డు పై నిలబడి ఉండటంతో కాలు జారీ ప్రమాదవశాత్తు వాగులో పడి నీట మునిగాడు. పక్కనే ఉన్న ఓ విద్యార్థి గమనించి తరుణ్‌ను రక్షించే ప్రయత్నం చేయగా.. మరి కొంత మంది విద్యార్థులు వాగు సమీపంలోని పొలాల్లో ఉన్న రైతుల వద్దకి వెళ్లి జరిగిన విషయం చెప్పారు. వెంటనే వారు వాగు వద్దకి వచ్చి తరుణ్‌ను బయటకు తీశారు. అప్పటికే తరుణ్ మృతి చెందారు.

విద్యుదాఘాతంతో నెలల బాలుడు..

లింగాల, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో చిన్నారి బాలుడు మృతి చెందిన సంఘటన లింగాలలో సోమవారం సాయంత్రం చోటు చేసుకొంది. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. తల్లి శిరీష, తండ్రి రామావత్ అశోక్ మొదటి సంతానం అభిరామ్ 11 నెలలు. సోమవారం సాయంత్రం తల్లిదండ్రులు ఇంటి బయట పనులు మీద ఉన్నారు. అభిరామ్ ఇంట్లోని పడక గదిలో ఆడుకుంటూ స్విచ్చు బోర్డుకు ఉన్న ప్లగ్ సాకెట్ రంధ్రాల్లో చేతి వేలును దూర్చటంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

కార్లు ఢీకొని పది మందికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన వారు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, ఉట్కూర్ న్యూస్‌టుడే : ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు, ఏడుగురికి స్వల్ప గాయాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర సమీపంలో చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 5న కారులో తిరుపతికి వెళ్లారు. సోమవారం దర్శనం పూర్తయిన తర్వాత అక్కడ నుంచి ఉదయం 6 గంటలకు తిరుగుపయనమయ్యారు. మార్గం మధ్యలోని మహబూబ్‌నగర్ మండలం ఓబ్లాయిపల్లి సమీపంలోని జాతీయ రహదారి-167 పై వారు ప్రయాణిస్తున్న కారు దేవరకద్ర నుంచి వస్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు. అప్పిరెడ్డిపల్లికి చెందిన శంకర్, అతడి భార్య అనురాధ, మూడేళ్ల కుమారుడు మాన్విక్‌రెడ్డి, కుటుంబ సభ్యులు చెన్నారెడ్డి, నర్సింహులు, అనంతమ్మ, డ్రైవర్ ప్రభాకర్‌రెడ్డి గాయపడ్డారు. అనురాధ, అనంతమ్మల తల, కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. చిన్నారి కాలుకు దెబ్బ తగిలింది. మరో కారులో ఉన్న మచిలీపట్నంకు చెందిన పాస్టర్ తిమోతీ, పీటర్‌పాల్, నిర్మలకుమారి తదితరులు ఉట్కూర్‌లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం ముగించుకుని హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ ప్రమాదంలో వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారు ప్రయాణిస్తున్న కారు బెలూన్స్ తెరచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామీణ ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారందరిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఎస్వీఎస్ ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

బాలాపూర్, న్యూస్‌టుడే: ఒకరు విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా.. మరొకరు విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ.. ఇద్దరూ అనుకోకుండా కలుసుకుని బయలుదేరిన 5 నిమిషాల వ్యవధిలోనే మృత్యువాతపడ్డారు. లారీ ఢీకొని ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు కథనం ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన షేక్ మదీనా బాషా(42).. భార్య, ఇద్దరు పిల్లలతో మీర్‌పేట టీకేఆర్ కళాశాల సమీపంలోని ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్నారు. ఆయన ఉప్పల్ ఫిర్జాదిగూడలోని టీజీఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం దర్పల్లికి చెందిన అన్నోజు శ్రావణ్‌కుమార్(40) నందనవనం ప్రాంతంలో భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. ఆయన టీకేఆర్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం 7 గంటల అనంతరం బాషా తన బైక్‌పై విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్నాడు. శ్రావణ్ ఆదివారం రాత్రి విధులకు హాజరై ఉదయం డ్యూటీ దిగి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంటికి వెళ్లేందుకు రహదారిపై వేచిఉన్నాడు. బాషా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా శ్రావణ్ కుమార్ లిఫ్ట్ అడిగి ఎక్కాడు. కొద్ది దూరం వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన లారీ.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న మీర్‌పేట పోలీసులు.. రెండు మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ మదీనా బాషా, శ్రావణ్‌కుమార్

తెరపై ఈనాడు

బాలాజీ - దేవర, తిరుమల - దేవర, వెంకటేశ్వర - దేవర వెంకటాద్రి - సత్యం సుందరం, శ్రీకృష్ణ - జోకర్ (ఉదయం ఆటలు), దక్షిణ (రాత్రి ఆటలు)
- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

ఉపాధితో ఊతమివ్వండి!



మరుగుజ్జుగా జన్మించిన గండీడ్ మండలం బల్సురుగొండకు చెందిన బి.వెంకటయ్య కొంత దూరం కూడా నడవలేక పోతున్నారు. కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆయనకు బంధువుల అమ్మాయితో వివాహం కాగా ఇద్దరు పిల్లలు జన్మించారు. అమ్మాయికి 10 ఏళ్లు కాగా అబ్బాయి ఏడాదిలోపు వయస్సు ఉంది. వీరిద్దరు కూడా వెంకటయ్య లాగే మరుగుజ్జు లక్షణాలతో జన్మించారు. గ్రామంలో వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ అతికష్టమ్మీద కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇంటర్ చదివిన తనకు 100 శాతం వైకల్యం ఉన్నట్లు అధికారులు సదరం ధ్రువపత్రం ఇచ్చారని, ఏదైనా ప్రభుత్వ శాఖలో ఉద్యోగ అవకాశం కల్పించి మూడు చక్రాల వాహనం ఇస్తే కుటుంబాన్ని పోషించుకుంటానని ఆయన చెబుతున్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి ఆదుకోవాలని వేడుకున్నారు.
- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ కలెక్టరేట్

భగీరథ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : భగీరథకాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. సోమవారం ఆయన పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి భగీరథకాలనీలోని పలు వీధుల్లో పర్యటించారు. కొత్తగా ఏర్పడిన వీధుల్లో మురుగు కాల్వలు, అంతర్గత రోడ్ల నిర్మాణాలు జరగాల్సి ఉందని, కొన్నిచోట్ల భూగర్భ డ్రైనేజీ దెబ్బతిందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఆర్థిక అంచనాలు రూపొందించి పనులు మొదలుపెట్టాలని ఎమ్మెల్యే ఛైర్మన్‌కు సూచించారు. 2వ వీధిలో రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్తు నియంత్రిక తొలగించాలని, భూగర్భ సెప్టిక్‌ట్యాంక్ పూడ్చేసి మురుగుకాల్వ నిర్మించాలని, పార్కును అభివృద్ధి చేయాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. సెప్టిక్‌ట్యాంకు పూడ్చేసి స్ట్రామ్ డ్రైన్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని, పార్కు అభివృద్ధికి ముడా నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఈఈ బస్వరాజ్, ఏఈ వైష్ణవి, కౌన్సిలర్లు రశ్మిత ప్రశాంత్, మోయిన్ అలీ, మాజీ కౌన్సిలర్ పాండురంగారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయ నివారణ అధికారిగా డా.మల్లికార్జున్

పాలమూరు, న్యూస్‌టుడే : జిల్లా క్షయ నివారణ అధికారిగా డా.మల్లికార్జున్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో క్షయ ఆసుపత్రి సిబ్బంది గోపాలకృష్ణ, సన్నీ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హన్వాడ, న్యూస్‌టుడే : చిన్నదర్పల్లి సమీపంలోని శ్రీలక్ష్మీ గోశాల వద్ద సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ ఛైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ లతశ్రీ, నాయకులు పరందాములు గౌడ్, యాదయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


బాలానగర్: ఉడిత్యాలలో శాకాంబరీదేవిగా


దేవరకద్ర : దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


నవాబ్‌పేట : శ్రీమహచండీగా పర్వతాపురం మైసమ్మదేవత


రాజాపూర్‌లో శాకాంబరీదేవిగా అలంకరణ.


నవాబ్‌పేట : అనంత పద్మనాభస్వామి దేవాలయంలో మహాలక్ష్మీదేవతగా..


మహబూబ్‌నగర్ : శ్రీనివాసకాలనీ వాసవీమాత ఆలయంలో

విశ్వ వినోదిని.. విష్ణు విలాసిని!


చొక్కంపేటలో ఆలయంలో భక్తులు

న్యూస్‌టుడే బృందం : శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. నాగేంద్రనగర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్త పోతుల రాంరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని వైష్ణవీదేవిగా అలంకరించి పూజలు చేశారు. రవీంద్రనగర్‌లోని శీతలాదేవి ఆలయంలో శాకాంబరిదేవిగా, శ్రీనివాసకాలనీలోని వాసవీమాత ఆలయంలో గాయత్రీదేవిగా, కుర్వనిశెట్టికాలనీలోని తోటమైసమ్మ దేవాలయంలో వనదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటేశ్వర, లక్ష్మీనగర్‌కాలనీలోని రాజరాజేశ్వరీమాత ఆలయంలో సామూహిక భజనలు చేశారు. జడ్చర్ల పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, రాంమందిర్ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పర్వతాపురం మైసమ్మ దేవత శ్రీమహాచండీదేవిగా దర్శనమిచ్చారు. దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలోని శ్రీకనకదుర్గాదేవి దివ్యక్షేత్రంలో పల్లకీసేవ నిర్వహించారు. బాలానగర్, మూసాపేట, అడ్డాకుల, రాజాపూర్, మిడ్జిల్ మండలాల్లో వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి.


మహబూబ్‌నగర్ : బతుకమ్మలతో మహిళ


మహబూబ్‌నగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో


మహబూబ్‌నగర్ : రవీంద్రనగర్‌లో శీతలాదేవి ఆలయంలో..


కుర్వనిశెట్టికాలనీలోని తోటమైసమ్మ ఆలయంలో..


దేవరకద్రలో పూజలు చేస్తున్న భక్తులు


మహబూబ్‌నగర్ : బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు


కోలాటం ఆడుతున్న యువతి


వేములలో మాలధారణ భక్తులు


జడ్చర్ల : కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


జడ్చర్ల : శివాలయంలో అలంకరణలో..



మహబూబ్‌నగర్ : వేంకటేశ్వరకాలనీలో దుర్గామాతకు మహిళల పూజలు.. కొత్తచెరువు రోడ్డులో దుర్గామాత వద్ద..


వేంకటేశ్వర, లక్ష్మీనగర్‌కాలనీలోని రాజరాజేశ్వరిమాత ఆలయంలో..


నాగేంద్రనగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో..


జడ్చర్ల : సకల దేవతల ఆలయంలో..


ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

మొక్కుబడిగా ప్రజావాణి

మిడ్జిల్ : కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం మండలస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా మొక్కుబడిగా సాగుతోంది. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి ఉదయం 11గంటలైనా పలువురు మండలస్థాయి అధికారులు గైర్హాజరు కాగా, పలు శాఖల నుంచి ద్వితీయ శ్రేణి సిబ్బంది హాజరయ్యారు. గ్రామస్థాయి సమస్యలను పరిష్కరించాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణిని పలు శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎనిమిది వినతులు.. : మండల ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై 8వినతులు వచ్చాయి. రెవెన్యూశాఖకు సంబంధించి 5, ఇతర సమస్యలపై 3ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో గీతాంజలి తెలిపారు.

దసరాలోపు వేతన బకాయిలు చెల్లించండి


కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు కురుమూర్తి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు దసరా పండుగలోపు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్మికులతో కలిసి నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మూడు మాసాలుగా కార్మికులు వేతనాలు లేకుండా పనిచేస్తున్నారని, పండుగలు సమీపిస్తున్నా ప్రభుత్వం బకాయిలు చెల్లించకుంటే ఎలాగని ప్రశ్నించారు. తెలంగాణ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ గౌడ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్యయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరద గాలెన్న తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం కార్మికులు కలెక్టర్ బి.విజయేందిరను కలిసి వినతిపత్రం సమర్పించారు. పండుగలోపు కార్మికులకు వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీపీవో పార్థసారథిని ఆదేశించారు.

బడుగులపై నిర్లక్ష్యం తగదు

హన్వాడ, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం దళితులు, గిరిజనుల సమస్యలను నిర్లక్ష్యం చేయటం తగదని సీపీఎం రాష్ట్ర నాయకుడు కిల్లే గోపాల్ ఆరోపించారు. సోమవారం హన్వాడ మండల కేంద్రంలో సీపీఎం హన్వాడ మండల సభ నిర్వహించారు. నాయకులు రాములు, కుర్మయ్యలు మాట్లాడుతూ హన్వాడ మండలంలోని ప్రధాన నీటి వనరైన హేమసముద్రానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు. పూడికను తీసి కాలువలను చక్కదిద్దాలన్నారు. అంతకు ముందు సీపీఎం జెండాను ఎగురవేశారు. మండల కమిటీ సభ్యులు రాములు, శేఖర్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ సీపీఎం నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

వినతులపై త్వరగా స్పందించండి : కలెక్టర్

హన్వాడ, న్యూస్‌టుడే : హన్వాడలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ విజయేందిర పరిశీలించారు. సోమవారం ఆమె మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోకి వచ్చి అధికారులతో మాట్లాడారు. మండల స్థాయిలోని సమస్యలను ఇక్కడే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వచ్చిన ఫిర్యాదుల వివరాలను తహసీల్దార్ కిష్టయనాయక్ కలెక్టర్‌కు వివరించారు.

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : కుటుంబ సర్వేకు సంబంధించిన పనులను కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న సర్వే సమాచారం నమోదు పనులను పర్యవేక్షించి సూచనలు చేశారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా అంతర్జాలంలో పొందుపరచాలని ఆదేశించారు. వెంట అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఉన్నారు.


ఉద్యోగినులకు గంట వెసులుబాటు కల్పించండి

మహబూబ్‌నగర్ పట్టణం : దసరా నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు మహిళా ఉద్యోగినులకు గంట ముందు ఇళ్లకు వెళ్లేలా వెసులుబాటు కల్పించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజీవ్ రెడ్డి, చంద్రానాయక్ డిమాండ్ చేశారు. దసరా సందర్భంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు.

ప్రజా ఫిర్యాదులు త్వరగా పరిష్కరించండి : కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అడ్డాకుల, పాలమూరు : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో వచ్చిన 43 వినతులు స్వీకరించిన కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవలి వరదలతో దెబ్బతిన్న రోడ్లు, పైపులైన్లు తదితరాలకు మరమ్మతులు చేయాలన్నారు. ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలకు కేటాయించిన పనులు త్వరగా చేపట్టి యూసీలు సమర్పించాలన్నారు. అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్ రావు, డీఆర్వో కేవీవీ రవికుమార్, జడ్పీ సీఈవో వెంకట రెడ్డి, డీఆర్‌డీవో నరసింహులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ నియమితులైన మల్లు నర్సింహ్మారెడ్డి కలెక్టర్ విజయేందిర బోయిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 9న జరిగే తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని విన్నవించారు.

- ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు వారికి రావాల్సిన బకాయిలు త్వరగా అందించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సనాతన బాలస్వామి, చంద్రకాంత్, నాయకులు కలెక్టర్‌ను కోరారు. సీపీఎస్ ఉద్యోగుల నుంచి పొదుపు చేసిన నిధులను సెప్టెంబరు 2024 నుంచి నేటి వరకు ఖాతాల్లో జమ కాలేదన్నారు.
- కోయిలకొండ మండలం దమాయిపల్లికి చెందిన ముగ్గురు అన్నదమ్ములకు సంబంధించిన 19.24 ఎకరాల ఇనాం భూమిని పెద్ద సోదరుడి పిల్లల పేరిటే పట్టాలు చేశారని ఆరోపిస్తూ వర్థ వెంకన్న, వర్ధ చెన్నయ్యల కుటుంబాలకు చెందిన సుమారు 80 మంది కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఇన్నాళ్లు ఆ భూమిని ముగ్గురు ముత్తాతల పిల్లలు సాగు చేసుకున్నారని, ఒకరి పేరిట చేసిన పట్టాలను రద్దు చేసి అందరికీ వాటా వచ్చేలా చేయాలని కోరారు.
- లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల ధ్రువపత్రం జారీ చేయలేదని టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్యాంబాబు, రమాకాంత్ కలెక్టర్‌కు ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు.
- మహబూబ్‌నగర్ సమీపంలోని బండమీదిపల్లిలోని ఓ వైన్స్ వద్ద చేసిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన బలీదుపల్లికి చెందిన శ్రీకాంత్ కుటుంబానికి న్యాయం చేయాలని బీసీ సమాజ్ నాయకులు, కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిసి కోరారు. అధికారులు నేరస్థులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టకపోతే బీసీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌లను ఆశ్రయిస్తామని తెలిపారు.


రూ.50వేల చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

వరద బాధితులకు సీనియర్ సిటిజన్ల ఉదారత

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : మహబూబ్‌నగర్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం రూ.50వేల చెక్కును జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ భారీ వర్షాలకు నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు సాయం అందించామన్నారు. ఫోరం ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, సభ్యులు అక్కినేని నారాయణ రావు, రాజసింహుడు, సురేశ్‌బాబు, బాలయ్య, బాలకృష్ణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రైల్వే వంతెనలు పూర్తిచేయండి


రైల్వే ఆర్ఎం, ఏజీఎంతో కలిసి వంతెన పనుల వివరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, న్యూస్‌టుడే : నిర్దేశించిన గడువులోగా సిగ్నల్‌గడ్డ పైవంతెన, రైల్వే స్టేషన్ సమీపంలోని అంతర్గత వంతెన పనులను పూర్తిచేసి ప్రజలకు వినియోగంలో తేవాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రైల్వే ఉన్నతాధికారులను కోరారు. జడ్చర్లలో సోమవారం ఆయన రైల్వే వంతెనల పనులను రైల్వే ఆర్ఎం మూర్తి, ఏజీఎం శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన, చేపట్టాల్సిన పనులపై ఆరాతీశారు. ఇప్పటికే తీవ్ర జాప్యం జరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు వివరించారు. అంతర్గత వంతెన నవంబరు మొదటి వారంలో వినియోగంలో తేవాలని, పైవంతెన త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వెంట కాంగ్రెస్ నాయకులు నిత్యానంతం, అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన జడ్చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. పుర ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్ చైతన్య పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై ఎమ్మెల్యే సమీక్ష

జడ్చర్ల, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో రైతులకు చెందిన రూ.207 కోట్ల రుణం మాఫీ అయ్యిందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. పాసు పుస్తకాలు, ఆధార్‌కార్డు, కుటుంబ వివరాల్లో పొరపాట్ల వల్ల కొందరికి మాఫీ కాలేదని పేర్కొన్నారు. జడ్చర్లలో సోమవారం ఆయన నియోజకవర్గ వ్యవసాయాధికారులతో రైతు రుణమాఫీపై సమీక్ష నిర్వహించారు. అధికారులను అడిగి కారణాలు తెలుసుకున్నారు. మంగళవారం నుంచి ఈ నెల 10 వరకు అధికారులు గ్రామాల్లో పర్యటించి రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించాలని ఏడీఏ ఆంజనేయులుకు సూచించారు. ఉదండాపూర్, వల్లూరు గ్రామాల్లో జలాశయం భూసేకరణ అనంతరం కొత్త పాసుపుస్తకాలు రాలేదని, రైతుల మిగిలిన భూములపై రుణాలు మాఫీ చేసి న్యాయం చేస్తామన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

అడ్డాకుల, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అడ్డాకులకు చెందిన సత్యనారయణరెడ్డి, పెంటమ్మలు గతవారం మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రంగన్నగౌడ్, సూర్యమోహన్‌రెడ్డి పాల్గొన్నారు

బాక్సింగ్ పోటీలో విద్యార్థిని ప్రతిభ

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన జె.వైష్ణవి రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలో ఉత్తమ ప్రతిభ చూపి ప్రథమ బహుమతి సాధించింది. షేక్‌పేట్‌లో జరిగిన సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో ఆమె ఈ ఘనత సాధించగా గ్రామస్థులు అభినందించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


క్రాంతికుమార్‌చారి

బాలానగర్, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన క్రాంతికుమార్ చారి(32) ఈనెల 4న షాద్‌నగర్ పరిధిలోని కొండారెడ్డిపల్లి శివారులో రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డారు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా హైదరాబాద్‌లో ఓ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పోలీసులను సంప్రదించగా ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

భార్యపై వేడినీరు పోసిన భర్త అరెస్టు

జడ్చర్ల, న్యూస్‌టుడే : భార్యపై వేడినీరు పోసిన భర్తను జడ్చర్ల పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం మర్రిచెట్టుతండాకు చెందిన భాస్కర్‌కు రాజాపూర్ మండలం నర్సంపల్లితండాకు చెందిన సరిత(28)తో వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం. గత నెల 26న భార్యాభర్తల మధ్య గొడవైంది. స్నానానికి వేడిచేసిన నీటిని భార్యపై పోయటంతో ఆమె శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. 27న బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు భాస్కర్‌ను రిమాండుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నిందితుడికి రిమాండ్

రాజాపూర్, న్యూస్‌టుడే : ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి యత్నించిన నిందితుడిని రిమాండ్ చేసినట్లు ఎస్సై కె.రవి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం. . కుచ్చర్‌కల్‌కు కావలి శ్రీను ఇంటి ముందు ప్రహరీలో ద్విచక్ర వాహనం నిలిపి నిద్రిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి శబ్దం వినిపించడంతో వారు బయటికి వచ్చి చూడగా అదే గ్రామానికి చెందిన కావలి ప్రవీణ్ ద్విచక్ర వాహనం తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. అతడిని పోలీసులకు అప్పజెప్పారు. సోమవారం కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు

రాజాపూర్, న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో దంపతులిద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై కె.రవి కథనం ప్రకారం... రాజాపూర్ మండలం ఖానాపూర్‌కు చెందిన దంపతులు పూజారి రాములు, లక్ష్మమ్మ ద్విచక్ర వాహనంపై విట్యాల గ్రామంలోని బంధువుల వద్దకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గం మధ్యలోని రంగారెడ్డిగూడ చౌరస్తాలో వెనక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. రాములు తల, చేతులకు తీవ్ర రక్తగాయాలు, లక్ష్మమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి, తర్వాత ఎస్‌వీఎస్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. డ్రైవర్‌పై లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

ఇసుక నిల్వలు స్వాధీనం

హన్వాడ : పూజారితండా సమీపంలో నిల్వ ఉంచిన ఆరు ట్రాక్టర్ల ఇసుకను సోమవారం స్వాధీనం చేసుకున్నామని హన్వాడ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఇసుకను యాదవ కాలనీకి చెందిన నందిపేట సత్తయ్య నిల్వ చేశారని స్థానికులు తెలపటంతో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోపన్‌పల్లి వాగు నుంచి అక్రమంగా తరలించి నిల్వ చేసిన ఇసుకను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. గ్రామంలోని వాగు నుంచి అక్రమంగా తరలించి నిల్వ ఉంచిన 25 ట్రాక్టర్ల ఇసుకను జప్తు చేసినట్లు ఆయన తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: భార్యాభర్తలపై అకారణంగా దాడిచేసి గాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మండలంలోని కారుకొండకి చెందిన కొండగళ్ల లక్ష్మమ్మ-కేశయ్య భార్యభర్తలు. కేశయ్య దివ్యాంగుడు కావడంతో గ్రామంలో కిరాణా దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బ్యాగరి శేఖర్, కావలి రాజు రాత్రి 9.30 గంటలకు దుకాణం వద్దకు వచ్చి భార్యాభర్తలపై దాడిచేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్, న్యూస్‌టుడే : మండలంలోని వాడ్యాల గ్రామశివారు దుందుబీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకున్నట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారని స్థానికుల సమాచారం మేరకు సిబ్బంది పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.